క్లుప్తంగా

గజవాహనంపై వెంకన్న



వెంకన్నకు హారతి ఇస్తున్న అర్చకుడు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వాహన సేవలకు వాల్మీకి వీధి భక్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ, భజన, లలిత సహస్రనామ ప్రవచనాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూలీలు కోరిన వెంటనే పనులు



సప్లయ్ ఛానల్ పనులు పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

తంబళ్లపల్లె : ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు కోరిన వెంటనే పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం సూచించారు. మండలంలోని రెడ్డికోటలో గురువారం ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. సప్లయ్ ఛానల్ పని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. జరిగిన పనులకు వెంటనే కొలతలు తీసి సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా చూడాలన్నారు. రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఏపీఓ అంజనప్ప, మండల టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

వర్షంతో చల్లబడిన కలకడ



కలకడలో కురుస్తున్న వర్షం

కలకడ : మండలంలో బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు ఓ మోస్తరు వర్షం కురవడంతో నేల చల్లబడింది. 42 డిగ్రీల వేడిని అధిగమించి ఎండలు ఉండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు బయట తిరగలేని పరిస్థితి ఉంది. రెండు రోజులు కురిసిన మోస్తరు వర్షాలకు చల్లటి వాతావరణం కనిపించింది.

తహసీల్దారు చొరవతో సమస్యకు పరిష్కారం



దారి ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దారు మహేశ్వరిబాయి

కలికిరి : ఏళ్ల తరబడి నెలకొన్న దారి సమస్యను తహసీల్దారు మహేశ్వరిబాయి చొరవ చూపి పరిష్కరించారు. మండలంలోని కురవపల్లి నుంచి బాహుదా నది, పొలాల వరకు గతంలో దారి ఉండేది. మూడేళ్లుగా కొందరు రైతులు తమ పట్టాభూమి అని చెప్పి దారిని మూసేశారు. ఇటీవల కురవపల్లి రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తహశీల్దారు పట్టా భూమి రైతులను ఒప్పించి సమస్య పరిష్కరించారు. పోలీసులు, గ్రామ పెద్దల సమక్షంలో దారి ఏర్పాటు చేయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రధానోపాధ్యాయుడు మృతి

బి.కొత్తకోట : మండలంలోని గుడిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.మునిపద్మనాభం గురువారం మృతి చెందారు. ఇటీవల బెంగళూరులో గుండె సంబంధిత వైద్యం చేయించుకున్న ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి చేరుకున్నారు. గురువారం ఉదయం ఆయన మృతి చెందారని ఎంఈవో రెడ్డిశేఖర్ తెలిపారు.


పిడుగుపడిన గృహం పరిశీలన

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓబిలి శ్రీనివాసులు రెడ్డి ఇంటి సన్‌సైడ్‌పై పిడుగు పడిన విషయం విధితమే. గురువారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పిడుగుపడ్డ ఇంటిని, విద్యుత్ అధికంగా రావడం వలన విద్యుత్ సామగ్రి కాలిపోయిన గృహాలను పరిశీలించారు. అనంతరం ఓజీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పిడుగుపడినప్పుడు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, అయితే పలు ఇళ్లల్లో ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోయాయన్నారు. దీంతో సుమారు రూ.10 లక్షలు మేర నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో ఓజీ శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు పున్నాటి వాసుదేవ రెడ్డి, ఎస్‌ఐ పి.మహేష్ నాయుడు, ఆర్‌ఐ రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ అమలుకు పచ్చజెండా.!

ఇంతకాలం మున్సిపల్ సేవలు పొందేందుకు అడ్డంకిగా ఉన్న నిబంధనలు తొలగిస్తూ ప్రభుత్వం మదనపల్లె సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం తెలిపింది. దీనిని ధ్రువీకరిస్తూ గురువారం మున్సిపల్ అధికారులు నోటీసు ద్వారా ప్రకటించారు. దీంతో ఇప్పటిదాకా కొనసాగిన గందరగోళ పరిస్థితులకు చెక్ పడింది. మదనపల్లె వాసుల కష్టాలకు చెక్ పడింది.

- 2024లో ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం
- ఇక బసినికొండ–కదిరిరోడ్డు వంద అడుగులు.
- రాష్ట్ర హైవేగా వంద అడుగులతో శాస్త్రీ వీధి
- నాలుగు జోన్లుగా విభజన.. పెరగనున్న ఆదాయం



మదనపల్లె పట్టణం

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీ పరిధిని నాలుగు జోన్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. కమర్షియల్, రెసిడెన్షియల్, మిక్స్‌డ్, పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్లను తీసుకొచ్చింది. పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తులు, కార్యాలయాలు, భూములు, ప్రైవేటు, ప్రభుత్వ విద్యాలయాలు, ఆస్పత్రులుటాయి. వాటికి మూడుజోన్ల నుంచి మినహాయింపు ఉంటుంది. 2044 వరకు ఈ మాస్టర్ ప్లాన్ అమలులో ఉంటుంది.

కమర్షియల్ ప్రాంతాలు

అమ్మచెరువుమిట్ట నుంచి వై జంక్షన్–కదిరిరోడ్డు, గొల్లపల్లె రింగ్ రోడ్డు, కదిరి రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, బెంగళూరురోడ్డు, సీటీఎం రోడ్డు, బర్మావీధి, గాంధీ రోడ్డు, నిమ్మనపల్లె రోడ్డు, పుంగనూరు రోడ్డు, అప్పారావు వీధి, అవెన్యూ రోడ్డు, చిత్తూరు బస్టాండ్ నుంచి శాస్త్రీ వీధి, తట్టివారిపల్లి జంక్షన్ నుంచి వై జంక్షన్ వరకు కమర్షియల్ ప్రాంతాలుగా గుర్తించారు. ఇక్కడ కమర్షియల్ లెక్కలోనే అనుమతులు మంజూరు చేస్తారు.

మిక్స్‌డ్ ప్రాంతాలు

కమర్షియల్, రెసిడెన్షియల్ కలిపిన ప్రాంతాల్లో చౌడేశ్వరీనగర్‌కు చెందిన ఐదు వీధులు, రాజానగర్, రామిరెడ్డి లేఅవుట్, రెడ్డీస్ కాలనీ మెయిన్ రోడ్డు, నక్కలదిన్నె నుంచి రామిరెడ్డిగారిపల్లి రోడ్డు, ప్యారానగర్, కోటవీధి, అగర్తలవీధి సందులు, వివేకానంద నగర్, హెచ్‌పీగ్యాస్ వీధి, లక్ష్మీనగర్‌కాలనీ, ఎస్వీఆర్ లేఅవుట్ మెయిన్‌రోడ్డు ఉన్నాయి. ఈ ప్రాంతాలను వాణిజ్య, నివాస ప్రాంతాలుగా గుర్తించి ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పై రెండు అంశాలకు సంబంధించిన ప్రాంతాలను మినహాయించగా మిగిలిన ప్రాంతాలన్నీ నివాస ప్రాంత జోన్ పరిధిలోకి వస్తాయి.

ఇక వంద అడుగుల రోడ్లు

మాస్టర్ ప్లాన్‌లో మదనపల్లె పట్టణ నడిబొడ్డున వెళ్లే రహదారులను విస్తరిస్తారు. ఇప్పటిదాకా 40 అడుగులతో ఉన్న శాస్త్రీ వీధిని వంద అడుగుల రోడ్డుకు విస్తరించి రాష్ట్ర హైవేగా మార్చారు. చిత్తూరు బస్టాండ్ నుంచి శాస్త్రీవీధి, రాగిమాను నుంచి మున్సిపల్ పరిధి వరకు ఈ రహదారి ఉంటుంది. అలాగే 60 అడుగుల రహదారులుగా ఉన్న అవెన్యూరోడ్డు, సీటీఎంరోడ్డు, గాంధీరోడ్డును వంద అడుగుల రోడ్డుగా మార్చారు.

మరిన్ని లాభాలు

పొన్నటిపాళెంలోని సర్వే నంబర్ 425లో మామిడికుండగా ఉన్న దాన్ని రెసిడెన్షియల్ చేశారు. పాత మాస్టర్‌ప్లాన్‌లోని బీకేపల్లిలోని సర్వే నంబర్ 280లో ఉన్న స్టేడియంను గురివిచెట్టిచెరువుగా మార్చారు. అంకిశెట్టిపల్లి, చిప్పిలి, కోళ్లబైలు, పప్పిరెడ్డిగారిపల్లి, బసినికొండ, కొంత రూరల్ ప్రాంతాన్ని కొత్తగా మాస్టర్‌ప్లాన్‌లో విలీనం చేశారు. గత మాస్టర్‌ప్లాన్ అనుమతి పొందిన మేరకు మున్సిపల్ పరిధి 14.20 చదరపు కిలోమీటర్లు కాగా కొత్త ఆమోదం ప్రకారం విస్తీర్ణం 37.26 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



మైనార్టీ నేత కుటుంబీకులను పరామర్శిస్తున్న నిస్సార్‌అహమ్మద్

రామసముద్రం : రాబోయేది తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. రామసముద్రం మండలం కొండూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి గృహప్రవేశ కార్యక్రమంలో తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, చిత్తూరు జెడ్పీ చైర్మన్ వాసులతో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల తీరు, కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న పథకాల తీరుపై కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెంబకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు షంషేర్ తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబీకులను నిస్సార్ అహమ్మద్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, ఎంపీపీ కుసుమకుమారి, రాష్ట్ర బీసి సెల్ జాయింట్ సెక్రటరీ గెవన్న, మదనపల్లె జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మండల కన్వీనర్ కేశవరెడ్డి, రెడ్డెప్పనాయుడు, గోపీనాథ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, బాలాజి, ప్రకాష్, రమణారెడ్డి, బషీర్, తట్టినాగరాజురెడ్డి, నయీం, రాజు, యూనస్, భాస్కర్‌గౌడ్, నంద, కృష్ణప్ప, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

పెద్దతిప్పసముద్రం : గత మూడు నెలలుగా తాగునీటి సమస్య ఉన్నా.. పరిష్కరించడం లేదని మండలంలోని గొల్లపల్లి వాసులు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వ బోరులో జలాలు అడుగంటడంతోనే ఈ దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇటీవల బోరును డ్రిల్లింగ్ చేయించగా నీరు పుష్కలంగా ఎగసి పడ్డాయని, మోటారు, పైపులు అమర్చితే సమస్య పరిష్కారమవుతుందన్నారు. సర్పంచ్ చెరువు నరసమ్మ మాట్లాడుతూ మోటారు, పైపులు అమర్చేందుకు వెళ్ళగా ప్రజలు అడ్డుకున్నారని, పాత బోరులోని పైపులు, మోటారు వెలికితీస్తే సదరు ప్రభుత్వ బోరును ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తారని చెప్పడంతో మిన్నకుండిపోయామన్నారు. కొత్త మోటారు అమర్చేందుకు తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, లక్షల రూపాయలు ఖర్చుచేసినా అధికారులు బిల్లులు మంజూరు చేయలేదన్నారు. గ్రామ పంచాయతి కార్యదర్శి సెలవులో వెళ్లినా.. కనీసం ఫోన్‌లో అందుబాటులో లేరని తెలిపారు. ప్రజా అవసరాల దృష్ట్యా మోటారు అమర్చి సమస్య పరిష్కరిస్తానని సర్పంచ్ హామీ ఇవ్వడంతో ప్రజలు నిరసన విరమించారు.

ఆధునిక వరి వంగడంతో అధిక దిగుబడి



దిగుబడిని పరిశీలిస్తున్న ఏడీఏ శివశంకర్

నిమ్మనపల్లె : ఆధునిక వరి వంగడాలతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మదనపల్లె వ్యవసాయ సహాయ సంచాలకు కె.శివశంకర్ అన్నారు. నిమ్మనపల్లె రైతుసేవా కేంద్రం పరిధిలోని నాగంవారిపల్లె రైతు సిజి.రాజారెడ్డి పొలంలో ఎన్ఎల్ఆర్–3648 చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ఏవో మురళీమోహన్, కేవీకే శాస్త్రవేత్త వై.పీరుసాహెబ్‌లతో కలిసి పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతు రాజారెడ్డి కలికిరి కేవీకే నుంచి నాలుగు కిలోల నూతన వరి వంగడం ఎన్ఎల్ఆర్–3648 విత్తనాలు తెచ్చి 120 రోజుల కాలపరిమితితో సాగు చేశారన్నారు. తుఫానుల ధాటికి నేల వాలకుండా ఉంటుందని పేర్కొన్నారు. నూతన రకంలో కాండం తొలుచు, అగ్గి తెగుళ్ల వృద్ధిని తట్టుకొని పంట పెరుగుతుందన్నారు. ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చన్నారు. ఆర్ఎన్ఆర్–15048తో పోల్చి చూస్తే ఎన్ఎల్ఆర్–3648 అధిక దిగుబడిని నమోదు చేసిందన్నారు. ప్రజలు ఆధునిక వరి రకం వైపు మొగ్గుచూపి అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు.. ఆదాయానికి మలుపు



ఆదర్శ ఉద్యోగులకు బహుమతి అందిస్తున్న ఆర్టీసీ డీఎం నిర్మల

పీలేరు రూరల్ : ఇంధన పొదుపు ఆదాయానికి మలుపు లాంటిదని ఆర్టీసీ డీఎం బి.నిర్మల పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో కార్మికులకు గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏప్రిల్‌లో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు ఎంఆర్.మూర్తి, జి.యర్రయ్యలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయని చెప్పారు. ఈపీకేలో ప్రతిభ చూపిన ఏడుగురు కండక్టర్లు బహుమతులు పొందినట్లు తెలిపారు. ఆర్టీసీ ఖర్చు తగ్గించి డిపో ఆదాయం పెంచడానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ హనీఫ్, సబ్బురామయ్య, మహబాష పాల్గొన్నారు.

డెంగీ జ్వరాల నివారణపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె రూరల్ : డెంగీ జ్వరాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి కలీలుల్లాఖాన్ అన్నారు. డెంగీ జ్వరాల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంజునాథ్ నగర్, ముజీబ్ నగర్‌లో దోమలతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ప్లకార్డులు చేతబట్టి, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిశుక్రవారం ప్రజలు డ్రైడే పాటించాలన్నారు. జ్వరం ప్రబలినపుడు సకాలంలో రక్త పరీక్షలు చేయించుకుని, చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదన్నారు. గర్భిణులు, బాలింతలు, పది సంవత్సరాలలోపు పిల్లలు, అరవై సంవత్సరాలు పైబడిన వారు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు దిల్ షాద్, సులోచన, నూర్జహాన్, ఆశా కార్యకర్తలు మల్లీశ్వరి, కమల, శంకరమ్మ, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

10న శని త్రయోదశి

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10న శనిత్రయోదశి నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు. ఉదయం శనీశ్వరుడికి తైలాభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మైనార్టీలకు 13 యూనిట్లు మంజూరు

తంబళ్లపల్లె : మండలంలోని మైనార్టీలకు బ్యాంకుల ద్వారా ఆర్థికసహాయం అందించేందుకు 13 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శ్లాబ్ వన్‌లో కోసువారిపల్లె, తంబళ్లపల్లె ఇండియన్ బ్యాంక్‌లకు మూడు చొప్పున ఎస్‌బీఐకు నాలుగు, శ్లాబ్2లో కోసువారిపల్లె, తంబళ్లపల్లె ఇండియన్ బ్యాంకులకు ఒకటి చెప్పున, శ్లాబ్3లో తంబళ్లపల్లె ఎస్‌బీఐకు ఒక యూనిట్ మంజూరైనట్లు తెలిపారు. 50 శాతం రాయితీ, మరో 50 శాతం బ్యాంకు రుణం అందిస్తారన్నారు.

12 నుంచి మాచుపల్లె రేణుకా యల్లమాంబ తిరునాల

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన జగజ్జనని శ్రీ రేణుకా యల్లమాంబ తిరునాల ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరుగునని గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన తెల్లవారుజామున అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగునన్నారు. 13న రాత్రి అమ్మవారి ఊరేగింపు, అనంతరం ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ రేణుకా యల్లమ్మ కల్యాణోత్సవం, కోలాట భజనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సింహ వాహనంపై ఊరేగింపు, అమ్మవారి కథ ఉంటుందన్నారు. తరువాత పాటల కచేరి ఉంటుందన్నారు. 15వ తేదీ అమ్మవారికి బోనాలు సమర్పణ, కోలాటం, ఊరేగింపు ఉంటుందన్నారు. మద్యాహ్నం 3 గంటలకు వృషభ రాజములచే బండ లాగుడు పోటీలు జరుగునన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన యడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ.1,00,116, రెండవ బహుమతి రూ.70,116, మూడవ బహుమతి రూ.50,116, నాల్గవ బహుమతి రూ.30,116, ఐదవ బహుమతి రూ.20,116లు అందజేస్తామన్నారు. రాత్రి శేష వాహనంపై అమ్మవారి ఊరేగింపు, చెక్క భజనలు, పండరి భజనలు జరుగుతాయన్నారు. 16వ తేదీన ఉదయం అమ్మవారి ఊరేగింపు, వసంతోత్సవం ఉంటుందన్నారు. కావున భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని గ్రామ పెద్దలు కోరారు. ప్రతి రోజు కడప రాజా జ్యువెలర్స్ యజమాని జరుగు రాజశేఖర్‌రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని తెలియజేశారు.

నేడు ప్రకృతి వ్యవసాయంపై సమావేశం

పుల్లంపేట : శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు అగ్రికల్చర్ ఏఓ శ్రీకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అగ్రికల్చర్, హార్టికల్చర్, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ అధికారులు హాజరు కావాలని కోరారు.

ముగిసిన పాగేటమ్మ తిరునాల



భక్తులకు దర్శనమిస్తున్న పాగేటమ్మ

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ గాండ్లపల్లె సమీపంలో కొలువైన శ్రీ పాగేటమ్మ తిరునాల గురువారంతో ముగిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు గావించారు. ఈ క్రమంలో మొక్కులు తీరిన భక్తులు చాందినీ బండ్లు కట్టి ఆలయ ప్రాంగణం చుట్టూ తిప్పారు. అంతేకాకుండా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో తిరునాలలో కొత్త శోభ సంతరించకొంది. జాతరలో మండల పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం చిప్పిలిలోని సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం రమాదేవి సమేత సత్యనారాయణస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం మహాగణపతి హోమం, పూర్ణాహుతి జరిపి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోని కళ్యాణమండపం వద్ద వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది. సాయంత్రం ఉత్సవమూర్తులను అలకరించి వాహనంలో చిప్పిలిలో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు పట్టి.. స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అమరనాథ్, రామకృష్ణ, దివాకర్, కుమారస్వామి, శివశంకర్, కోదండరామయ్య, ప్రసాదరావు, మురళీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దాం



చింతల రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని సత్కరిస్తున్న హరినాథరెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొద్దామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన హరిప్రసాద్‌రెడ్డి గురువారం వాల్మీకిపురంలో చింతల రామచంద్రారెడ్డిని కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా విఫల మైందని, సూపర్‌సిక్స్ హామీలు అట్టర్ ఫ్లాప్ అయినట్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో చక్రధర్, ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, భువన, ప్రవీణ్, జాకీర్, ఇమ్రాన్, జగదీష్, సాయి, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి – ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యానిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన హరిప్రసాద్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. పార్టీ కోసం చేపట్టిన కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదన్నారు. ఆదాయంతో ముడిపెట్టకుండా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అడ్డదారిలో గెలిచి ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రభుత్వం ప్రజలను ఏ రకంగా వంచించిందో అర్థమయ్యేలా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు, మహిళలను హామీలను చేసిన మోసాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వెంకటరమణయాదవ్ దంపతులకు నివాళులర్పిస్తున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి

కలకడ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా పేదలకు ఒరింగింది ఏమీ లేదని, సూపర్‌సిక్స్ హామీలు అమలుకాలేదని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కదిరాయచెర్వు గ్రామంలో కార్యకర్తలతో గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నో హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి నేతలు నేడు ప్రజలపై అధిక భారం మోపుతున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదు.. దాన్యం కొనుగోలు చేసేవారు లేరు.. మహిళలకు ఉచిత బస్సులేదు.. పిల్లలకు అమ్మ ఒడిలేదు.. రైతులకు పెట్టుబడి సాయంలేదు.. అన్నారు. మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలతో కలసి ప్రతి కార్యకర్తకూ అండగా నిలుస్తామన్నారు. జగనన్న ప్రభుత్వంలో కాలనీలు నిర్మించారని గుర్తుచేశారు. అంతకు ముందు గుర్రంకొండ లోని వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లకాసుల శేఖర్ గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. అనంతరం ఇటీవల యల్లంపల్లి సత్యనారాయణరెడ్డి తల్లి వెంకటలక్ష్మమ్మ, కదిరాయచెర్వు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవియాదవ్ తండ్రి వెంకటరమణారెడ్డి, వాల్మీకీపురం మండలం గెలసంవారిపల్లెకు చెందిన రమణారెడ్డి, కొత్తపల్లె గ్రామానికి చెందిన దండురాజారెడ్డి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకుని ఆయా కుటుంబీకులను చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుమార్‌నాయుడు, కమలాకర్‌రెడ్డి, జీవీ.కిశోర్, మోహన్‌రాజనాయుడు, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, చిరంజీవి యాదవ్, శేఖర్‌యాదవ్, చలమయ్యగౌడ్, ప్రదీప్ రెడ్డి, బాబురెడ్డి, కాస్మూరి మస్తాన్ అహమ్మద్, రెడ్డెప్పనాయుడు, పుల్లయ్య, ద్వారకనాథరెడ్డి, శ్రీనివాస ఆచారి, అంజన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : మండలంలోని గొడసానిపల్లెకు చెందిన వాటర్‌షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో వెళుతూ ఆరు రోజుల క్రితం ప్రమాదానికి గురై గాయపడ్డారు. తిరుపతిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గురువారం బాధితులను పరామర్శించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరిస్తూ ఎలాంటి కష్టనష్టాలు వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కోటకొండ సర్పంచ్ అరుణ, చంద్ర శేఖర్‌ల నూతన గృహ ప్రవేశానికి హాజరై స్థానిక ప్రజలతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు, సూపర్‌సిక్స్ పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన తీరును ప్రజల్లో ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో చౌడేశ్వర్, సుధాకర్‌రెడ్డి, కరీం, రెడ్డినారాయణ, కరీముల్లా, చలపతి, శ్రీరాములు, మల్లికార్జున,పద్మనాభరెడ్డి, ఎంపిటీసీ మహేష్, రామశంకర్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలి



ఆదర్శ రైతులను సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

పీలేరు : ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలని ఏడీఏ వై.వి.రమణరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులకు స్వస్తి పలికి.. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని కోరారు. తద్వారా ఖర్చు తగ్గడం, నాణ్యమైన పంట దిగుబడితో అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఒక్క ముదుపులవేములలో 290 మంది రైతులు 235 ఎకరాల్లో పంటలు సాగు చేయడం అభినందనీయం అన్నారు. అనంతరం ఆదర్శ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జవహర్ బాషా, ఏవో రమాదేవి, ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల భర్తీకి మోక్షమెప్పుడో?



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

పెద్దతిప్పసముద్రం : జాతీయ ఉపాధి హామీ కార్యాలయం పరిధిలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్ల భర్తీ ప్రక్రియ ఎప్పటికి నోచుకుంటుందో తెలియని పరిస్థితి. ఉపాధి హామీ పనులు నిర్వహించే సిబ్బందికి పెనుభారం తప్పడం లేదు. ఫలితంగా కూలీలకు బిల్లులు చెల్లించడం ఆలస్యమవుతోంది. మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సగం పంచాయతీల్లో క్షేత్ర స్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. దీంతో ఆయా పంచాయతీల్లో పని చేసే టెక్నికల్ అసిస్టెంట్లపై అదనపు భారం పడుతోంది. కూలీలకు పనులు కల్పించడం, మస్టర్లు రాయడం, బిల్లులు పెట్టడం, దగ్గరుండి కొలతలు వేయించడం వంటి పనులు ఫీల్డ్ అసిస్టెంట్లు చేయాల్సి ఉంది. వాటితోపాటు పండ్ల తోటలు సాగు చేసిన రైతుల పొలాలను సందర్శించే పనులన్నీ వారే చూసుకోవాల్సి వస్తోంది. దీంతో తమపై భారం పెరిగిందని పలువురు సాంకేతిక సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియామక ఉత్తర్వులు అందినా.. విధుల్లో చేరేందుకు ఆసక్తి కనబరచడం లేదు. కూటమి నాయకుల రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారు పని చేసేందుకు వెనకడుగు వేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.